క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీలోకి పంచాయతీ వార్డు సభ్యులు



అచ్చంపేట: మండలంలోని తాడువాయిలో టీడీపీకి చెందిన పంచాయతీ వార్డు సభ్యులు మందా ఇమ్మానియేలు, కొవ్వూరి నాగరాజు తదితరులు బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత వారం రోజుల్లో మండలంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన అనేకమంది టీడీపీ, జనసేన పార్టీల వారు స్వచ్ఛందంగా వైఎస్సార్‌ సీపీలో చేరుతున్నారన్నారు. ఇన్నాళ్లు టీడీపీలో ఉండి ఏవిధమైన లబ్ధిపొందని వారంతా వైఎస్సార్‌ సీపీలో చేరుతున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి మేలు చేయడమే తమ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, విశ్రాంతి ఉద్యోగి షేక్‌ ఖాన్‌ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పోలీసు కవాతు



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్తెనపల్లి టౌన్‌ సీఐ పోలూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌ రోడ్, తదితర ప్రాంతాల్లో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు, పోలీసు బలగాలు, తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



ముప్పాళ్ళ: ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల మండల నోడల్‌ ఆఫీసర్‌ ఎస్‌.సాంబశివరావు అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం, ఇరుకుపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును బుధవారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఇంకా అసంపూర్తిగా ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలపై ముసుగులు, రాజకీయ పార్టీల పోస్టర్‌లు కనిపించకుండా రంగులు వేయించారు. ఆయా గ్రామ సచివాలయాల సిబ్బందితోను సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫోటోలు ఉండకూడదన్నారు. ఆయా గ్రామాల వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



పెదకూరపాడు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు అన్నారు. పెదకూరపాడులోని కాకతీయ డిగ్రీ కళాశాలలో నూతనంగా ఓటు హక్కు పొందిన యువతకు అవగాహన సదస్సు జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం శ్రీరాములు మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ఓటు వినియోగించుకుని సరైన నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువత ఓటు విలువ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి విజయబెన్నిబాబు, కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్‌ సాంబశివరావు, సామాజిక విశ్లేషకులు రాయపూడి సాంబశివరావు, జనచైతన్య సమితి కో–ఆర్డినేటర్‌ వి.అనిల్‌కుమార్‌, కళాశాల ప్రిన్సిపల్‌ అశోక్‌బాబు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గురజాల: మండల పరిధిలోని గంగవరం గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం కోరుతున్నట్లు ప్రిన్సిపాల్‌ జ్యోతి తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ ఆఫర్‌

- పన్ను కట్టాల్సిన వారికే కాకుండా కట్టిన వారికీ వర్తింపు
- పన్ను వసూళ్లకు సత్తెనపల్లిలో ఏడు ప్రత్యేక బృందాలు
- ఇప్పటి వరకు రూ. 357.24 లక్షలు వసూలు



పురపాలక సంఘం ముఖ ద్వారం



పన్ను రాయితీపై ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్‌

సత్తెనపల్లి: పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలో గృహ, ఖాళీ స్థలాలకు సంబంధించి పన్ను బకాయిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. ఈ నెల 31లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం నిర్ణయంతో పట్టణంలోని సాధారణ ప్రజలతో పాటు వ్యాపారులకు ఊరట లభించింది. పట్టణంలోని నివాసాలు, వాణిజ్య భవనాలకు మున్సిపాలిటీ ఆస్తి పన్ను వసూలు చేస్తోంది. వేలాది మంది ఆస్తి పన్ను చెల్లించక పోవడంతో బకాయిలపై వడ్డీ భారీగా పెరిగిపోతోంది. పదేళ్ల పాటు ఆస్తి పన్ను చెల్లించకపోతే వడ్డీతో కలిపి రెండింతలు అవుతుంది. అసలు, వడ్డీ చెల్లింపులు భవన యజమానులకు భారంగా మారుతు న్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వన్‌ టైం సెటిల్మెంట్‌ (ఓటీఎస్‌)ను తీసుకొచ్చింది. గత ఆర్థిక సంవత్సరం ముగింపులోనూ వడ్డీ మాఫీ ప్రకటించిన ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది బంపర్‌ ఆఫర్‌ ఇచ్చింది. పట్టణంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ వర్తించాలంటే బకాయిలతో సహా మొత్తం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది.

పన్ను వసూళ్లకు ప్రత్యేక చర్యలు

ఆస్తి పన్ను ఖ,ాళీ స్థలాల పన్ను బకాయిల వసూలుకు సత్తెనపల్లి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పట్టణంలో 15 సచివాలయాలు ఉండగా ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఐదుగురు ఉంటారు. రెండు సచివాలయాలకు ఒకరు చొప్పున ఎనిమిది మంది పురపాలక సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు. వీరు ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఎక్కువ పన్ను బకాయిలు ఉన్న భవన యజమానులకు ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌ను వివరిస్తున్నారు. సచివాలయాల్లో ఆస్తి పన్ను చెల్లించే అవకాశం కల్పించారు. సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో మొత్తం 15,938 గృహ అసెస్మెంట్‌లు ఉండగా వీటి ద్వారా పాత బకాయిలు, ప్రస్తుతం డిమాండ్‌ కలిపి రూ.566.64 లక్షలు, ఖాళీ స్థలాల అసెస్మెంట్‌లు 909 ఉండగా వీటి ద్వారా పాత బకాయిలు, ప్రస్తుత డిమాండ్‌ కలిపి రూ.45.23లక్షలు వసూలు కావాలసి ఉంది. ఆస్తి పన్ను బకాయిల వడ్డీ మాఫీపై సత్తెనపల్లి పురపాలక సంఘంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్లో ఆస్తి పన్ను బకాయిలు, వాటికి సంబంధించిన వడ్డీ నమోదైంది. బకాయిదారులు ఆన్‌లైన్‌ ద్వారా చెల్లిస్తే దానంతట అదే మాఫీ తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు.

కట్టేసిన వారికి వచ్చే పన్నుల్లో తగ్గింపు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే భవనాలు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికి కూడా మేలు చేకూరేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పటికే ఆస్తి పన్ను చెల్లించిన వారు ఎంత చెల్లించారో వడ్డీ లెక్కగట్టి వచ్చే ఏడాది ఆస్తి పన్నులో ఆ మొత్తాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సత్తెనపల్లి పట్టణ సమాచారం

- మొత్తం వార్డులు –31
- సచివాలయాలు –15
- గృహ అసెస్మెంట్‌లు –15,938
- ప్రస్తుత సంవత్సర ఆస్తి పన్ను– రూ.470.61లక్షలు
- ప్రస్తుత సంవత్సర ఆస్తి పన్ను వసూలు– రూ.325.04 లక్షలు
- పాత బకాయిలు – రూ.96.03 లక్షలు
- పాత బకాయిలు వసూలు– రూ.17.13 లక్షలు
- వసూలు కావాల్సిన ప్రస్తుత, పాత బకాయిలు–రూ.224.47లక్షలు
- ఖాళీ స్థలాల అసెస్మెంట్లు–902
- ప్రస్తుత సంవత్సర పన్ను – రూ.20.09 లక్షలు
- ప్రస్తుత సంవత్సర పన్ను వసూలు –రూ.7.18 లక్షలు
- పాత బకాయిలు –రూ.25.14 లక్షలు
- పాత బకాయిలు వసూలు –రూ.7.89 లక్షలు
- వసూలు కావాల్సిన పాత, ప్రస్తుత బకాయిలు –రూ.30.16 లక్షలు

వెళ్లినంత వేగంగా వెనక్కి..



బందల బుడాకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి

సత్తెనపల్లి: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కండువాలు కప్పినవారు సత్వరమే ఆ పార్టీకి బైబై చెప్పేస్తున్నారు. వెళ్లినంత వేగంగా తిరిగి సొంతగూటికి చేరుతున్నారు. ముప్పాళ్ళ మండలం గోళ్లపాడు మాజీ సర్పంచ్‌ ఒబ్బాని కుమారి తిరిగి మంగళవారం వైఎస్సార్‌ సీపీలోకి రాగా.. ఈ పరంపర కొన సాగుతూనే ఉంది. ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామానికి చెందిన బందల బుడాకు ఇటీవల కన్నా లక్ష్మీనారాయణ టీడీపీ పార్టీ కండువాలు కప్పారు. దీంతో టీడీపీలోకి భారీగా వలసలని ప్రచారం జరిగే లోపే తిరిగి వారంతా వైఎస్సార్‌ సీపీ జండా నీడన చేశారు. బుధవారం బందల బుడా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. వైఎస్సార్‌ సీపీలోకి తిరిగి రావటం సొంతింటిలోకి వచ్చినంత సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, నాయకులు అచ్యుత శివప్రసాద్, జొన్నలగడ్డ ఆనంద్, తోట లక్ష్మీనారాయణ, యాంపాటి కొటిరెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి అంబటికి సత్కారం

ముఖ్యమంత్రి వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షపాతి అని, అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని పెద్దమక్కెన గ్రామంలో గల ఎస్టీ కాలనీ వాసుల అభివృద్ధికి సహకరించిన మంత్రి అంబటి రాంబాబుకు వారు బుధవారం కృతజ్ఞతలు తెలియజేసేందుకు తరలివచ్చారు. పట్టణంలోని వైఎస్సార్‌ సీపీ కార్యాయంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. సత్తెనపల్లి రూరల్‌ మండల వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డి, వద్దుల రామకృష్ణారెడ్డి (బుల్లిబాబు) తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా వీరాంజనేయస్వామి తిరునాళ్ల



వీరాంజనేయస్వామి పూజలు చేస్తున్న అర్చకులు

నకరికల్లు: రూపెనగుంట్ల గ్రామంలోని వీరాంజనేయస్వామి ఆలయ 52వ వార్షిక తిరునాళ్లను బుధవారం కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం ప్రారంభమైన ఏకాహం బుధవారంతో ముగిసింది. తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్చకులు నారాయణం వెంకట కృష్ణమాచార్యులు, రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. విశేషంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ మండల కన్వీనర్‌ భవనం రాఘవరెడ్డి, పలువురు నాయకులు స్వామివారిని దర్శించుకొన్నారు. స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయం వద్ద మహా అన్నదానం చేశారు. ఎస్‌ఐ పి.రాంబాబు బందోబస్తు నిర్వహించారు.

పేదల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



పార్టీలో చేరిన కాపు నాయకులతో మంత్రి అంబటి రాంబాబు

రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: రాష్ట్రానికి పవన్‌ కల్యాణ్‌ సీఎం అవుతాడని భావిస్తే.. తమను చంద్రబాబు నాయుడు వద్ద తాకట్టు పెట్టి మోసం చేసాడని పలువురు కాపు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. నకరికల్లుకు చెందిన పలువురు జనసేన కాపు నాయకులు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో మండల కన్వీనర్‌ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్‌ సీపీలో చేరారు. కాసా నాగేశ్వరరావు, రామకృష్ణ, భానుచందర్‌కు మంత్రి అంబటి పార్టీ కండువా కప్పి, సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌ కల్యాణ్‌ను నమ్మి మోసపోయామన్నారు. మూడు జెండాలు మోయలేమని, అభివృద్ధి కాంక్షిస్తూ వైఎస్సార్‌ సీపీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడారు. వైఎస్సార్‌ సీపీ ఇతర జెండాలు మోసే పనిలేదని ఒకే జెండా, ఒకే అజెండా అన్నారు. పేదల అభివృద్ధే వైఎస్సార్‌ సీపీ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌ సీపీలో చేరిన వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పక్కాల సూరిబాబు, వైస్‌ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బీ బాషా, శాగం చంద్రశేఖర్‌రెడ్డి, రుసుం శ్రీనివాసరావు, మార్లెళ్ల ఆదినారాయణ, పరసా సాంబయ్య పాల్గొన్నారు.

స్థానికుడినే ఆశీర్వదించండి

గత పన్నెండేళ్లుగా సత్తెనపల్లిలోనే నివాసముంటున్నానని మూడోసారి సత్తెనపల్లి నుంచి పోటీ చేస్తున్నానని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండల కన్వీనర్‌ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో కుంకలగుంట గ్రామ కార్యకర్తలతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 లేదా 26 తేదీల్లో కుంకలగుంట గ్రామంలో భారీ ఎన్నికల ప్రచార ప్రారంభ సభ ఉంటుందన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్‌ అనిల్‌ కుమార్‌యాదవ్‌తో పాటు ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో పాలనకు, వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖమ్మంపాడులో పోలీసు కవాతు



పెదకూరపాడు : మండలంలోని సమస్యాత్మక గ్రామమైన ఖమ్మంపాడులో బుధవారం సీఐ మంగారావు ఆధ్వర్యంలో బోర్డర్‌ సెక్యూరిటీ ఫోర్స్‌ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మంగారావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి భయాందోళన లేకుండా ప్రతి ఒక్క ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకోవాలన్నారు. గ్రామాల్లో అల్లర్లకు, హింసాత్మక ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ఓటర్లు ప్రలోభాలకు లోనుగాకుండా సరైన ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కవాతులో ఎస్సై విప్పర్ల వెంకట్రావు, బోర్డర్‌ సెక్యూరిటీ ఫోర్స్‌ పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవకాశాలు



విద్యార్థులకు కెరీర్‌ గైడ్‌లైన్స్‌ పుస్తకాలు అందించిన హెచ్‌సీఎల్‌ కంపెనీ ప్రతినిధులు

పెదకూరపాడు: ప్రతిభ కలిగిన ప్రతి విద్యార్థికి భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని హెచ్‌సీఎల్‌ కంపెనీ కో–ఆర్డినేటర్‌ గురునాథం అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల బాలికల కళాశాలను ప్రముఖ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ హెచ్‌సీఎల్‌ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐటీ రంగంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్‌ కంపెనీ కో–ఆర్డినేటర్‌ గురునాథం మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌ తర్వాత ఐటీ రంగంలో అవకాశాలు ఎలా అందిపుచ్చుకోవాలో విద్యార్థులకు వివరించారు. ప్రతిభకల విద్యార్థులను ఎంపిక చేసి ఆరు నుంచి 12 నెలల పాటు హెచ్‌సీఎల్‌ కంపెనీ శిక్షణ ఇస్తుందని తెలిపారు. శిక్షణ కాలంలోనే ప్రతినెలా రూ. 10 వేలు స్టయిఫండ్‌ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు రూ. 2.20 లక్షల వార్షిక వేతనం ఇస్తామన్నారు. ఒక పక్క జాబ్‌ చేస్తూ చదువులో రాణించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పీజీటీలు బాజీఖాన్, అజిత, రమణ, మూర్తి, ఏసుబాబు, పేరెంట్స్‌ కమిటి చైర్మన్‌ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, జూనియర్‌ అసిస్టెంట్‌ వాణి, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని పొలాలపై రియల్టర్‌ పంజా

- అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో లేఅవుట్లు
- ప్రతిపక్షనేత అండదండలు చూసుకొని టీడీపీ నేత నిర్వాకం
- ప్రతిఫలంగా ఎన్నికల్లో అభ్యర్థి ఖర్చు కొంత భరించేలా ఒప్పందం..?
- ముడుపులకు ఆశపడి పట్టించుకోని అధికారులు



సత్తెనపల్లిలోని పారిశ్రామిక వాడ వెనుక వేస్తున్న అనుమతులు లేని లేఅవుటు

సత్తెనపల్లి: ప్రతిపక్ష నాయకుడి అండదండలతో.. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయన ఆర్థిక వ్యవహారాలు చూసే టీడీపీ నేత ఒకరు నిబంధనలకు తిలోదకాలిచ్చేశారు. వ్యవసాయ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌ వేస్తున్నారు. గుంటూరు రోడ్డులో గల సత్తెనపల్లి పట్టణ శివారులో(పారిశ్రామిక వాడ వెనుక) ప్రధాన రహదారి వద్ద నుంచి అమరావతి మేజర్‌ కాలువ పక్కన కరకట్టపై గతేడాది నవంబరులో జల వనరుల శాఖ అధికారుల అనుమతులు లేకుండా అనధికారికంగా టీడీపీకి చెందిన రియల్టర్‌ రోడ్డు వేశారు. కార్తీక వన సమారాధన పేరుతో గ్రావెల్‌ తోలి చదును చేసి, డస్ట్‌ వేసి శాశ్వత రహదారి స్థాయిలో పనులు చేపట్టారు. దీంతో జల వనరుల శాఖ అధికారులు ఆ రోడ్డును ధ్వంసం చేసి, పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంత కాలం మౌనంగా ఉన్న సదరు రియల్టర్‌ ప్రస్తుతం ఎన్నికల హడావుడి కావడంతో ప్రతిపక్ష నాయకుడికి ఎన్నికల ఖర్చుల్లో కొంత మొత్తం భరించేలా ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. ఆయన అండదండలు చూసుకొని తనకు చెందిన పది ఎకరాల భూమిలో నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్‌ వేస్తున్నారు. ఇక్కడ సెంటు భూమి రూ. 3 లక్షలు చొప్పున కనీసంగా విలువ కట్టినా రూ. 30 కోట్లకు తగ్గకుండా వ్యాపారం సాగుతోంది. వాస్తవానికి ఇది ఇంకా ఎక్కువగా ఉంటుంది. కన్వర్షన్‌ చట్టం ప్రకారం ప్రభుత్వానికి రూ. లక్షల్లో ఆదాయం సమకూరాల్సి ఉంది. యంత్రాంగం ఉదాసీనత కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. సాధారణంగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకోవాలంటే ల్యాండ్‌ కన్వర్షన్‌ చేసేందుకు ముందుగా భూమి మార్కెట్‌ విలువలో 10 శాతం వంతున చలానా తీసి రెవెన్యూ డివిజనల్‌ అధికారికి దరఖాస్తు చేయాలి. పది శాతం స్థానిక అవసరాలకు, 20 శాతం రహదారులకు వదిలేయాలి. అందులో 33 అడుగుల అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారిని 40 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేయాలి. ముందుగా పురపాలక సంఘానికి దరఖాస్తు చేయాలి. తాగునీరు, విద్యుత్తు, మురుగు కాలవల సదుపాయం కల్పించి ప్లాట్లు విక్రయించాలి.

ఇలాంటి ప్లాట్లు కొంటే ఇబ్బంది

నాన్‌ లేఅవుట్ల సంగతి తెలియని అమాయక ప్రజలు తక్కువ ధరలకు స్థలాలు దొరుకుతున్నాయన్న ఆశతో కొనుగోలు చేస్తున్నారు. అనంతరం పురపాలక సంఘం నుంచి మౌలిక సదుపాయాలు అందక, బ్యాంకు రుణాలు మంజూరు కాక ఇక్కట్లు పడుతున్నారు. పురపాలక సంఘం కూడా వీటిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేకుండా పచ్చని పొలాలను లేఅవుట్లుగా మారుస్తున్న వ్యవసాయ భూములను క్షేత్ర స్థాయిలో పరిశీలించి విచారణ జరిపి బాధ్యుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏపీ ఫైబర్‌ నెట్‌వర్క్‌ బాక్సులు అప్‌గ్రేడ్‌

అమరావతి: ఏపీ ఎస్‌ఎఫ్‌ఎల్‌ నెట్‌వర్క్‌లోని అన్ని బాక్కులు సస్పెండ్‌ చేసినట్లు ఏపీ స్టేట్‌ ఫైబర్‌ నెట్‌ లిమిటెడ్‌ డీఎం శివశంకర్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఎల్‌ఎంఓలు, ఎంఎస్‌ఓలు వినియోగదారులకు తెలియజేయలన్నారు. అలాగే ఇమేజ్‌ వెర్షన్‌ అప్‌గ్రేడేషన్‌ సాంకేతిక సమస్యను పరిష్కరించడం కోసం ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల సంఘం ప్రవర్తన నియమావళిని అనుసరించి సమస్యను పరిష్కరించడానికి యుద్ధ ప్రాతిపదికన సాంకేతిక బృందం పనిచేస్తోందని తెలిపారు. తదుపరి 48 గంటల్లో అప్‌గ్రేడేషన్‌ కార్యకలాపాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా నాగేశ్వరస్వామి పునఃప్రతిష్ట



పునః ప్రతిష్ట మహోత్సవంలో భక్తులు

చిలకలూరిపేట: పట్టణంలోని కళామందిర్‌ సెంటర్‌లో పునఃనిర్మాణం చేసిన శ్రీగంగా బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానం పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులతో యంత్ర స్థాపనములు, బింబు స్థాపనములు, దిష్టికుంభం, ధేనుదర్శనములు, కళాహోమములు, పూర్ణాహుతి, అవబృధము, మహదాశీర్వచనము, శాంతి కళ్యాణం, మంగళహారతి, భక్తజనకోటి దివ్య దర్శనం ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కావటి శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ పునఃనిర్మాణ కమిటీ చైర్మన్‌ పి.వీరనారాయణ, సభ్యు లు జి.రమణమూర్తి, వి.లక్ష్మినారాయణ, ఎల్‌.ఆదినారాయణరెడ్డి, పి.పూర్ణచంద్రరావు, బి.సుబ్బారావు, జి.పోలయ్య, జి నాగభూషణం, పి.శివసత్యనారాయణ, వారణాసి వెంకట సుబ్రమణ్యం దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ ఎం.సుబ్బారావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌ సీపీలో టీడీపీ నాయకుల చేరిక



క్రోసూరు: మండలంలోని గరికపాడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గుడె చెన్నయ్య, పలువురు కార్యకర్తలు బుధవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారిని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.